క్లుప్తంగా

టిక్కెట్ల కేటాయింపులో ముదిరాజ్‌లకు అన్యాయం



దోమకొండ: రాజకీయ పార్టీలు టిక్కెట్ల కేటాయింపుల్లో ముదిరాజ్‌లకు అన్యాయం చేస్తున్నాయని, ఆయా పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు భూపాల్ విజయానంద్, కన్వీనర్ అబ్రబోయిన స్వామి అన్నారు. శనివారం దోమకొండ పెద్దమ్మ ఆలయంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మంది ముదిరాజులు ఉన్నారన్నారు. కానీ అధికార పార్టీ ఒక్క ఎమ్మెల్యే టిక్కెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లు ఏకమై తమ సామాజిక వర్గానికి జరిగిన అన్యాయంపై పోరాడుతారని, ఎన్నికల్లో ఓటుతో సమాధానం చెబుతారన్నారు. సీతారాం మధు, ఆశబోయిన శ్రీను, లింగం, పులబోయిన రమేష్, శంకర్, నర్సింలు, అంజయ్య, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వీపర్ల డిమాండ్లు నెరవేర్చాలి

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల డిమాండ్లను నెరవేర్చాలని ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి మమత డిమాండ్ చేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద స్వీపర్ల దీక్షకు ఆశావర్కర్లు శనివారం మద్దతు తెలిపారు. స్వీపర్లు బాలయ్య, అశోక్, మునీరోద్దిన్, శంకర్, విఠల్, గంగాధర్, గంగయ్య, ఆశావర్కర్లు స్వరూప, పద్మ, అనిత, తులసి, సావిత్రి పాల్గొన్నారు.

దేవాగౌడ్‌కు మదర్ థెరిసా ఎక్సలెన్స్ అవార్డు



పిట్లం: పిట్లం బ్లూబెల్స్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ జానపద కళాకారుడు దేవాగౌడ్ నేషనల్ లెవల్ మదర్ థెరిసా ఎక్సలెన్స్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. దేవాగౌడ్ మాట్లాడుతూ ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ వారు మదర్ థెరిసా జన్మదినం పురస్కరించుకొని కళా, సేవా రంగాల్లో రాణిస్తున్న వారికి ఈ అవార్డు అందజేస్తారని చెప్పారు.

నిజాంసాగర్ ఎస్సైగా రాజశేఖర్



నిజాంసాగర్: నిజాంసాగర్ ఎస్సైగా పొరెడ్డి రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజు సదాశివనగర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మెదక్ జిల్లా నుంచి రాజశేఖర్ వచ్చారు.

ఇంటింటికీ కాంగ్రెస్

బాన్సువాడ: బాన్సువాడలో శనివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్, రూ.నాలుగు వేల పింఛన్, రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఖలేక్, అసద్, మంత్రి గణేశ్, అఫ్రోజ్, శ్రీనివాస్, నార్ల రఘు, గుడాల నగేష్, సాయిలు, గంగాధర్, వెంకన్న, షోహబ్, సలీం, మతీన్, అలీం ఉన్నారు.

స్పీకర్‌ను కలిసిన విద్యుత్ కార్మిక సంఘం ప్రతినిధులు



బాన్సువాడ రూరల్: చాలిచాలని జీతాలతో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం క్యాజువల్ లేబర్స్ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సంస్థను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడంలో తమ పాత్ర ఉన్నా టైమ్ స్కేల్ లేదని, మినిమమ్ వేజెస్ ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. సాయికుమార్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించే వరకు సమ్మె చేస్తాం



కామారెడ్డిరూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు పేర్కొన్నారు. శనివారం ఏఎన్‌ఎంల సమ్మెకు ఆశా వర్కర్లు మద్దతు తెలిపారు. సీఐటీయు పట్టణాధ్యక్షుడు రాజనర్సు, ఏఎన్‌ఎంలు స్వరూప లక్ష్మి, దీవెన, రజనీత, రేణుక, కవిత పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పెద్దకొడప్‌గల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే



మాచాపూర్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సురేందర్

సాక్షి, నెట్‌వర్క్: మొక్కలను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యేలు హన్మంత్‌సింధే, జాజాల సురేందర్ అన్నారు. శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. జుక్కల్ ఎమ్మెల్యే సింధే పెద్దకొడప్‌గల్‌లో, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ మాచాపూర్‌లో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పచ్చదనం బాగా పెరిగిందన్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు.



అన్నారంలో.. కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



తాండూర్‌లో.. ఎంపీపీ, అధికారులు



బీబీపేటలో..



భూంపల్లి అంబరీశుని గుట్టపై..



తాడ్కోల్‌లో..



బొప్పాస్‌పల్లిలో..

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయాల్లో పూజలు



నిజాంసాగర్: శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని మంగ్లూర్ గ్రామస్తులు 21 గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, జల అభిషేకాలు నిర్వహించారు. మంగ్లూర్ నుంచి చుట్టు పక్క గ్రామాల్లో ఉన్న 21 హనుమాన్ ఆలయాలకు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా తరలి వెళ్లారు.

చిట్యాలలో..



తాడ్వాయి: మండలంలోని చిట్యాల హన్మాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. హన్మాన్ స్వాములు హనుమాన్ చాలీసా పఠించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రవికాంత్‌చారి, ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, బండారి యాదవరెడ్డి, తేలు ఆంజనేయులు, బండారి నర్సారెడ్డి పాల్గొన్నారు.

మద్నూర్‌లో యజ్ఞం



మద్నూర్: మద్నూర్‌లో శనివారం పతాంజలి యోగా పీఠ్ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

నేడు సరస్వతి ఆలయంలో యజ్ఞం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి మాత ఆలయ ఆవరణలో విద్యమనోహర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం యజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎండుతున్న ఆశలు



బీబీపేట: ఎంతో కష్టపడి వేసిన పంటలు ప్రస్తుతం మండిపోతున్న ఎండలకు ఎండిపోతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, జనగామ, యాడారం, మల్కాపూర్, మాందాపూర్, తుజాల్‌పూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో పంటలే నీళ్లు అందకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇరవై రోజులుగా వరుణుడు కరిణించక పోవడంతో పంటలకు నీరందడం లేదు.

కాంగ్రెస్‌లో చేరిక



మాచారెడ్డి: మండలంలోని మర్రి తండా, బంజపల్లి, సోమారంపేట గ్రామాల్లోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు శనివారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో సదర్ నాయక్, మాన్సింగ్, భూక్య గణేశ్‌నాయక్, తిరుపతి నాయక్ రాజు నాయక్, బిలాల్ నాయక్ ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ గోవర్ధన్ చిత్రపటాలకు దివ్యాంగులు శనివారం పాలాభిషేకం చేశారు. దివ్యాంగులకు రూ.నాలుగు వేల పెంచడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు జగ్గన్నగారి రామ్‌రెడ్డి, నాగార్తి బాల్‌రెడ్డి, పైళ్ల సుధాకర్‌రెడ్డి, చేపూరి రామదాసు, ఎరుకల పోచయ్య, జగ్గన్నగారి అనిత పాల్గొన్నారు.

భిక్కనూరులో పారిశుధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

భిక్కనూరు: భిక్కనూరుకు ఈ నెల 28న ఎమ్మెల్సీ కవిత వస్తుండడంతో శనివారం గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. సెంట్రల్ లైటింగ్ డివైడర్‌పై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. పనులు ఎంపీవో ప్రవీణ్‌కుమార్, ఈవో సదాశివులు పర్యవేక్షించారు.

సైబర్ నేరాలపై అవగాహన



గాంధారి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సదాశివనగర్ సీఐ రామన్ అన్నారు. శనివారం ఆయన గాంధారి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. ఎస్సై సుధాకర్, ఏఎస్సై గంగారాం ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి



బీజేపీలో చేరిన వారితో వెంకటరమణారెడ్డి

కామారెడ్డి రూరల్: అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామానికి చెందిన 25 మంది శనివారం బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని, రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఇందుకోసం పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇంకా చేరికలు ఉంటాయన్నారు.

ఆలయంలో గ్రానైట్ పనులు ప్రారంభం

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గల వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయానికి సరిపడే గ్రానైట్‌ను వెంకటరమణారెడ్డి అందజేశారు. గ్రానైట్ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రమణారెడ్డిని సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగయ్యచారి, కార్యదర్శి రమేష్‌చారి, లక్ష్మీకాంతం చారి, ఎస్ఎన్ చారి, రవీందర్ చారి, గోపాల్ చారి, లక్ష్మీపతిచారి, భాస్కరచారి, దత్తాచారి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్‌జైన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రాజంపేటలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజంపేట: రాజంపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనిల్‌కుమార్ శనివారం పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఫారం 6, 7, 8లను స్వీకరించాలని ఆదేశించారు. ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

నాగిరెడ్డిపేట: గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని శనివారం తహసీల్దార్ మహేందర్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, ఆర్ఐ ప్రసాద్ వేర్వేరుగా పరిశీలించారు. నూతనంగా ఓటర నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు.

సంఘాలు ఆర్థికంగా ఎదగాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

లింగంపేట: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రవీందర్ సూచించారు. శనివారం ఆయన లింగంపేట మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. అనంతరం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గడ్డం సులోచన, ఉపాధ్యక్షురాలిగా మంద నందిన, కార్యదర్శిగా బండ ఎల్లవ్వ, సహాయ కార్యదర్శిగా నాయిని జయమ్మ, కోశాధికారిగా కీసర భీమవ్వను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. డీపీఎంలు సుధాకర్, రమేశ్‌బాబు, వకుళ, సురేష్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆశావర్కర్ల ధర్నా



నిజాంసాగర్‌లో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు



బాన్సువాడలో..

సాక్షి, నెట్‌వర్క్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి, తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.



పిట్లంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు



నాగిరెడ్డిపేటలో..

ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన



పెద్దకొడప్‌గల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యమిత్ర

లింగంపేట/పెద్దకొడప్‌గల్/భిక్కనూరు: ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌పై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. లింగంపేట, పెద్దకొడప్‌గల్, భిక్కనూరు, దేవునిపల్లిలోని గురుకుల పాఠశాలల్లో ఆరోగ్య మిత్రలు అనిల్‌కుమార్, సంతోష్, మహేందర్, రాణి, కృష్ణవర్ధన్ అవగాహన కల్పించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఈ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

స్కూల్ బ్యాగుల పంపిణీ

గాంధారి: మండలంలోని నాసీరాం తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం బామన్ ఫౌండేషన్ చైర్మన్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బాధితులకు నిత్యావసర సరుకులు..

లింగంపేట: మండలంలోని జల్దిపల్లిలో చిలుక బేతయ్య ఇల్లు శుక్రవారం కాలిపోవడంతో బాధిత కుటుంబానికి సర్పంచ్ రవి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ గన్యానాయక్, సిద్ధిరాములు, అంజయ్య, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు..

ఎల్లారెడ్డి: పట్టణంలోని శేర్ల ప్రకాశ్‌కు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. నాయకులు ఇమ్రాన్, ఎంపీటీసీ సంతోష్ ఉన్నారు.

శ్రీసిద్ధరామేశ్వరాలయ అభివృద్ధికి విరాళం

భిక్కనూరు: భిక్కనూరులోని శ్రీసిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి కామారెడ్డికి చెందిన పబ్బ వేణుగోపాల్–శోభ దంపతులు రూ.5వేలు శనివారం విరాళం అందజేశారు. దాతలను ఆలయ పునర్ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. పూజారి రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

గొట్టిముక్కులలో ఆయుర్వేద వైద్య శిబిరం

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కులలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యులు వెంకటేశ్వర్లు మందులను ఉచితంగా అందజేశారు. సర్పంచ్ ధర్పల్లి స్వరూప, ఎంపీటీసీ ఆసాని జ్యోతి, పార్మాసిస్టు శ్రీనివాస్‌గౌడ్, ఎంఎల్‌హెచ్‌పీ మహబూబ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

దోమకొండ: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్నట్లు ఎంపీపీ కానుగంటి శారద తెలిపారు. శనివారం దోమకొండ జీపీలో నూతనంగా బీడీ టేకేదార్‌లు, దివ్యాంగులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఈవో సౌజన్య, ఏపీఎం రాజు, ఎంపీటీసీ సదానంద ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మత్తమాల సిద్ధిరాములు కుటుంబానికి శనివారం అతని స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. సిద్ధిరాములు ఈ నెల 23న రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. సిద్ధిరాములుతో కలిసి 1991–92లో గోపాల్‌పేట హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న స్నేహితులంతా కలిసి రూ.21,500 కుటుంబ సభ్యులకు అందజేశారు. మసీయోద్దీన్, యాదగౌడ్, ఆశయ్య, యాదగిరి, కిషన్ తదితరులున్నారు.

పశువులకు టీకాలు

నస్రుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్‌లో శనివారం పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. సర్పంచ్ పురం లక్ష్మి, పశువైద్య సిబ్బంది బావయ్య, తుకారం ఉన్నారు.

మదర్ థెరిసా జయంతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో బీఎస్పీ నాయకులు శనివారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. థెరిసా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాయిబాబా, సాయిలు ఉన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయక ముందే సర్దుబాటు చేయడంపై ఫిర్యాదు

సదాశివనగర్: మండలంలోని మల్లుపేట్‌కు చెందిన వీఆర్ఏ పోతరాజు రాజయ్యపై సస్పెన్షన్ ఎత్తి వేయకముందే అధికారులు పేస్కేల్ అమలు చేసి వేరేశాఖలో ఉద్యోగం ఇవ్వడంపై అదే గ్రామానికి చెందిన ఇంజమూరి శ్రీనివాస్ శనివారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. పోతరాజు రాజయ్య వీఆర్ఏగా బాధ్యతలు చేపడుతు గతంలో టీఆర్ఎస్ తరపున ప్రచారం చేశాడు. ఈ విషయంలో అప్పుడు అన్ని ఆధారాలతో సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన అధికారులు సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తివేయక ముందే ఉన్నతాధికారులు మళ్లీ ఉద్యోగం కల్పించడం చట్ట విరుద్ధం అని పేర్కొన్నారు.

పరామర్శ

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట గ్రామాల్లో శనివారం పలువురి కుటుంబాలను మాజీఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పరామర్శించారు. గోపాల్‌పేటలో జగ్గి జయరాజ్, నింగి సాయిలు, బాషుమియా, బాబురావుతోపాటు నాగిరెడ్డిపేటలో మత్తమాల సిద్దిరాములు కుటుంబాలను ఆయన పరామర్శించారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు ఉన్నారు.

‘బీఆర్ఎస్ తీర్మానాన్ని ప్రజా తీర్మానం అంటారా’



మాచారెడ్డి: బీఆర్ఎస్ తీర్మానాన్ని ప్రజా తీర్మానమని ఎలా అంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్ నాయక్ ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు త్వరలో బుద్ధి చెబుతామన్నారు. శనివారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేయడానికి బీఆర్ఎస్ నాయకుల జాగీరు కాదన్నారు. ఎల్లంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి 1200కు పైగా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఒంటిద్దు పొకడతో గ్రామం మొత్తం బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేస్తామని తీర్మానం చేసినట్లుగా ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు నౌసిలాల్ నాయక్, సునావత్ శ్రీనివాస్, జరుపుల బోజ్యానాయక్, సంజీవ్, శ్రీనివాస్, తిరుపతి, నరేష్, సదార్‌నాయక్, మాన్‌సింగ్, రాజునాయక్, బానోత్ గణేష్ ఉన్నారు.

గురుకుల కాలేజీలో ప్రవేశాలకు రేపు స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంక్యాంపు తండాలో గల గురుకుల బాలికల విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో మిగిలిన సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పద్మకుమారి తెలిపారు. పదో తరగతి పాసైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాజరు కావాలన్నారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి సోమవారం చివరి రోజు అని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సోమవారం ఉదయం 10గంటలకు ధ్రువ పత్రాలతో కాలేజీకి రావాలని సూచించారు.